

నేటినుంచి

ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం
- శుభాకాంక్షలు తెలిపిన సీఎం సహా పలువురు నేతలు
- పుదువైలో కూడా పరీక్షా కేంద్రాలు

చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికా ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,21,057 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేలా ప్రభుత్వ పరీక్ష శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. 3,78,545 మంది విద్యార్థులు, 4,24,023 మంది విద్యార్థినులు, 18,344 మంది ప్రైవేటు అభ్యర్థులు, 145 మంది ఖైదీలు ఈ పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 3,316 పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో సుమారు 45వేల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించనుండగా, పరీక్షల్లో అవకతవకలు అడ్డుకొనేలా 4,800 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటయ్యాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే పరీక్షలు ఈ నెల 25వ తేదీతో ముగియనున్నాయి.

పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు నిషేధం...

పరీక్షా కేంద్రాల ప్రాంగణాల్లోకి విద్యార్థులు సెల్‌ఫోన్ తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించగా, విధుల సమయంలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడకంపై విధించారు. నిబంధనలు అతిక్రమించిన విద్యార్థులు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు చేపడతామని విద్యాశాఖ హెచ్చరించింది. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, టాయిలెట్‌తో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. కాగా, పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించిన విద్యుత్ బోర్డు, పరీక్షా కేంద్రాల వద్ద ఉద్యోగులను విధులకు నియమించింది.



పరీక్షా కేంద్రాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

పుదుచ్చేరిలో...

తమిళనాడు ప్రభుత్వ పాఠ్య ప్రణాళికలో పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని 102 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ప్రైవేటు అభ్యర్థులు కలిపి మొత్తం 8,105 మంది ప్లస్ టూ పరీక్షలు రాయనున్నారు. కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరికి ప్రత్యేక విద్యా బోర్డు లేదు. ఆ రాష్ట్రంలోని ప్రభుత్వం పాఠశాలల్లో సీబీఎస్‌ఈ పాఠ్య ప్రణాళిక అమలుచేస్తున్నారు. అలాగే, కొన్ని ప్రైవేటు పాఠశాలలు తమిళనాడు పాఠ్య ప్రణాళికలో విద్యాబోధన చేపట్టాయి. ప్లస్ టూ విద్యార్థుల కోసం పుదుచ్చేరిలో 20, కారైక్కాల్‌లో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

ఈ పరీక్షలకు పుదుచ్చేరిలోని 86 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6,992 మంది విద్యార్థులు, 362 మంది ప్రైవేటు అభ్యర్థులు, కారైక్కాల్‌లో 16 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 640 మంది విద్యార్థులు, 111 మంది ప్రైవేటు అభ్యర్థులు కలిపి మొత్తం 8,105 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు...

పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాలు తీర్చేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ టూ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 25వ తేది వరకు, ప్లస్ వన్ పరీక్షలు ఈ నెల 5 నుంచి 27వ తేది వరకు, టెన్త్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ఏప్రిల్ 15వ తేది వరకు జరుగనున్నాయి. ప్లస్ టూ పరీక్షలకు 8,21,057 మంది విద్యార్థులు, ప్లస్ వన్ పరీక్షలకు 8,23,261 మంది, టెన్త్ పరీక్షలకు 9,13,036 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో, పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏర్పడే సందేహాలు, పరీక్షలపై ఫిర్యాదుచేసేలా ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. పరీక్షల రోజుల్లో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనున్న ఈ కంట్రోల్ రూమ్‌ను 9498383075, 9498383076 అనే నెంబర్లలో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి: సీఎం స్టాలిన్



పబ్లిక్ పరీక్షలు రాయనున్న టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సీఎం సూచించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. "గత ఏడాది కాలంగా మీ తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులు మీ విద్యకు మద్దతుగా, ప్రేరణగా నిలిచారు. వారందించిన సహకారంతో మీరు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారు. ఈ పబ్లిక్ పరీక్షలు మీ ఉన్నత విద్యకు, జీవితానికి అత్యంత ముఖ్యమైన పునాదివంటిది. మీరు ఇప్పటివరకు చేసిన కృషి, పట్టుదలతో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారని నాకు పూర్తిగా నమ్మకం ఉంది. మీ ఆరోగ్యం, నిద్ర, ఆహారం, మానసిక స్థితిపై కూడా శ్రద్ధ వహించాలి. మీ ఉన్నత విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం 'పుదుమై పెన్', 'నాన్ ముదల్వన' సహా పలు పథకాలు అమలుచేస్తోంది. నేను, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం. ఏడాది కాలంగా చేసిన మీ కృషికి పూర్తి విజయం చేకూరాలని కోరుకుంటున్నా" అని సీఎం ఆకాంక్షించారు. అదే విధంగా ప్లస్ టూ పరీక్ష రాసే విద్యార్థులకు పలు రాజకీయ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలుపుతూ వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా

రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు

- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



చెన్నై, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానం అమలుచేయాలని నిర్బంధం వంటి అంశాలను నిరశిస్తూ, కేంద్రప్రభుత్వ తీరును ఖండిస్తూ రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రకటించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం అమలుచేయనందున విద్యా నిధులు ఇవ్వలేమని ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. అలాగే, తమిళనాడు త్రిభాషా విధానాన్ని అంగీకరిస్తేనే విద్యా నిధులు ఇస్తామని కూడా పేర్కొన్నారు. కేంద్రమంత్రి వ్యాఖ్యలను ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. నిధుల పేరుతో బీజేపీ ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తోందని, ఈ నిర్బంధాన్ని రాష్ట్ర ప్రజలు అంగీకరించరని సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి రాష్ట్రంలోని అన్ని పార్టీలు ఖండించగా, డీఎంకే మిత్రపక్షాలు, డీఎంకే యువజన, విద్యార్థి విభాగాలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం తన 72వ జన్మదినం జరుపుకున్న సీఎం స్టాలిన్, ద్విభాషా విధానమే తమ లక్ష్యమని, హిందీ నిర్బంధాన్ని అంగీకరించబోమని పునరుద్ఘాటించారు. ఈ క్రమంలో, డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన ఎక్స్ పేజీలో.. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ఖండిస్తూ అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నామని తెలిపారు. అందులో భాగంగా సోమవారం కోడంబాక్కంలో బహిరంగ సభ జరుగుతుందని ప్రకటించారు.

హిందీ చదువుకున్నవారు

ఉపాధి కోసం వస్తున్నారు

- డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ



అడయార్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): హిందీ చదువుకున్నవారు కూలీ పనుల కోసం మన రాష్ట్రానికి వస్తున్నారని డీఎంకే సీనియర్ నేత, డీఎంకే రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని పలువురికి సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టే అనేక పథకాలను ఇతర రాష్ట్రాలే కాదు ఇతర దేశాలు సైతం అమలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా హిందీని రుద్దాలని కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. కానీ, అలాంటి చర్యలు విరమించుకోవాలని ధైర్యంగా చెప్పింది మనమేనన్నారు. పైగా హిందీలో చదువుకున్న వారు అనేక మంది కూలీ పనుల కోసం రాష్ట్రానికి వస్తున్నారన్నారు. 2026 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను పునర్వ్యవస్థీకరించడం వల్ల తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గిపోతాయన్నారు. ఈ విషయాన్ని తాము వెలుగులోకి తేవడంతో అప్రమత్తమైన కేంద్ర పాలకులు సీట్ల సంఖ్య తగ్గబోదని చెబుతున్నారన్నారు. దక్షిణాదిలో సీట్ల సంఖ్య తగ్గబోదని చెప్పే నేతలు... ఉత్తరాదిలో సీట్ల సంఖ్య పెరగదని చెప్పగలరా అని తిరుచ్చి శివ ప్రశ్నించారు.

టీవీకేలోకి వలసలు?

- భారీ బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్న విజయ్



అడయార్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)లోకి వివిధ పార్టీల నుంచి భారీ చేరికలుంటాయని తెలుస్తోంది. ఇందులో భాగంగా విజయ్ త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సమాచారం. ఇటీవల ఆ పార్టీ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేసమయంలో 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం విజయ్ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా విజయ్ జాతీయ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు, టీవీకేలో చేరేందుకు బీజేపీ, అన్నాడీఎంకే నేతలు ఉవ్విళ్లూరుతున్నట్టు సమాచారం. వీరిలో పలువురు సీనియర్ నేతలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలున్నట్టు సమాచారం. వీరందరినీ ఒకేసారి పార్టీలోకి ఆహ్వానించేలా భారీ బహిరంగ సభ నిర్వహించాలని విజయ్ భావిస్తున్నారు. ఇందుకోసం అవసరమైన తేదీ, ప్రదేశం తదితర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారనే ప్రచారం సాగుతుంది. అలాగే, పార్టీ నేతలతో కలిసి వచ్చే ఎన్నికల్లో విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై విజయ్ సమాలోచనలు జరుపుతున్నట్టు సమాచారం.

నేడు నిర్ణయం వెల్లడి

లోక్‌సభ సీట్లను 2026 జనాభా లెక్కల ప్రకారం పునర్వ్యవస్థీకరిస్తే తమిళనాడుతో సహా దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదే అంశంపై చర్చించేందుకు సీఎం స్టాలిన్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 5వ తేదీ బుధవారం జరుగనున్న ఈ మీటింగ్‌కు రాష్ట్రంలోని 45 పార్టీలకు ఆహ్వానించారు. అయితే, ఈ సమావేశానికి బీజేపీ, టీఎంసీ వంటి పార్టీలు హాజరుకావడం లేదని తేల్చి చెప్పాయి. టీవీకే మాత్రం తమ నిర్ణయాన్ని సోమవారం వెల్లడిస్తామని ప్రకటించింది. ఇదే విషయంపై పార్టీ అధ్యక్షుడు విజయ్ పార్టీ ముఖ్యనేతలు, సీనియర్లతో నేడు సమావేశం నిర్వహించి ఆ తర్వాత తమ నిర్ణయాన్ని వెల్లడించనున్నారు.

టీవీ డిబేట్లను నమ్మొద్దు : బుస్సీ ఆనంద్

టీవీ డిబేట్లలో తమ పార్టీ గుర్తించని వ్యక్తులు చేసే మాటలను పార్టీ కార్యకర్తలు నమ్మొద్దని టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయ్ సారథ్యంలో టీవీకే ఆవిర్భవించిన యేడాదిలోనే పార్టీ బలం పుంజుకోవడంతో పాటు పార్టీ రెండో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాన్నారు. పైగా పార్టీ ఓటు బ్యాంకు కూడా క్రమంగా పెరుగుతున్నట్టు సర్వేలు వెల్లడిస్తున్నాయన్నారు. వీటిని జీర్ణించుకోలేని కొందరు టీవీ డిబేట్లలో పార్టీ ప్రతినిధులుగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీ గుర్తించని వారు చెప్పే మాటలను ఏ ఒక్కరూ నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆమెపై ఆధారాలు

త్వరలోనే వెల్లడిస్తా

- నటి విజయలక్ష్మిపై సీమాన్ తీవ్ర వ్యాఖ్యలు



అడయార్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తనపై లైంగిక ఆరోపణలు చేసిన సినీ నటి విజయలక్ష్మిపై సినీ దర్శకుడు, నామ్ తమిళర్ కట్చి కన్వీనర్ సీమాన్ తీవ్రంగా వ్యాఖ్యలు చేశారు. ఆమె ఒక సెక్స్ వర్కర్ అని, అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని సంచలన ఆరోపణ చేశారు. నామ్ తమిళర్ కట్చి ఆధ్వర్యంలో తెన్‌కాశి జిల్లా కడయనల్లూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు ఆయన ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన చెన్నై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. తాను లైంగిక వేధింపులకు పాల్పడ్డానంటూ తనను ఒక నేరస్థుడిగా చిత్రీకరించే ప్రయత్నం డీఎంకే ఎంపీ కనిమొళి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న లైంగికదాడులపై ఆమె ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలా తనపై నిందలు వేస్తున్నారన్నారు. పైగా కేసు విచారణ జరుగుతున్న సమయంలో తనను నేరస్థుడిగా ఎలా చిత్రీకరిస్తారని ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేసి, కేసులు పెట్టిన నటి విజయలక్ష్మి ఒక సెక్స్ వర్కర్ అని, దానికి సంబంధించిన ఆధారం తన దగ్గరుందన్నారు. 'ఎంజాయ్‌మెంట్ విత్‌ఔట్ రెస్పాన్సిబులిటీ' అంటూ మీ నేత పెరియార్ చెప్పారని, ఆ పనే కదా తాను చేసింది అని ప్రశ్నించారు. ఆ విధంగా చూసినా మీ నేత అడుగుజాడల్లోనే తాను కూడా నడుస్తున్నానని గుర్తుచేశారు. ఇది ఎలా తప్పు అవుతుందని, దీనికి డీఎంకే ఏమని సమాధానం చెబుతుందన్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు రెండు మూడు సీట్ల కోసం డీఎంకే అంటిపెట్టుకుని ప్రజా సమస్యలపై నోరు విప్పడం లేదన్నారు. ద్రావిడాన్ని అంతం చేసేది ఒక్క పులి మాత్రమేనన్నారు. త్రిభాషా విధానంపై రెండు పార్టీల వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కచ్చాదీవి ధారాదత్తం వలనే

తమిళ జాలర్లకు కష్టాలు

- గవర్నర్ ఆర్‌ఎన్ రవి విమర్శ



గవర్నర్‌కు తమ సమస్యలు తెలుపుకుంటున్న జాలర్లు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నాటి కేంద్రప్రభుత్వం భారత్ ఆధీనంలో వున్న కచ్చాదీవిని శ్రీలంకకు ధారాదత్తం చేయడంవల్లే తమిళ జాలర్లకు కష్టాలొచ్చాయని గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యాఖ్యానించారు. ఇటీవల రామనాథపురం జిల్లా నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్ళిన తమిళ జాలర్లను సముద్ర సరిహద్దులు దాటారని శ్రీలంక నావికా దళం అరెస్టు చేయడంతో పాటు వారి పడవలను కూడా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిని ఖండిస్తూ జిల్లాలోని రామేశ్వరం, తంగచ్చి మఠం, పాంబన్, మండపం ప్రాంతాల మరబోట్ల యజమానులు, జాలర్లు శుక్రవారం చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఇదిలావుండగా, జాలర్ల సమ్మె కారణంగా రామేశ్వరం నుండి ఆదివారం కూడా మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళలేదు.

ఈ నేపథ్యంలో, పలు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం రామనాథపురానికి వెళ్ళిన గవర్నర్ రవి . నిరాహార దీక్ష చేపట్టిన జాలర్లను కలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. తమిళనాడు కోస్తా జిల్లాలోవున్న మత్స్యకారులు నష్టపోవడానికి కారణం 1974వ సంవత్సరం కేంద్రంలో అధికారంలోవున్న ప్రభుత్వం కచ్చాదీవిని శ్రీలంకకు అప్పజెప్పడమేనని వ్యాఖ్యానించారు. తమిళ జాలర్లకు నష్టం కలిగించే విధంగా అప్పటి కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆ సమయంలో రాష్ట్రంలో అధికారంలోవున్న డీఎంకే కూడా సమర్థించిందన్నారు. అప్పటినుండి తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళ సిబ్బంది దాడులు చేస్తూనే ఉన్నారని తెలిపారు. కడలిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సమన్వయంగా తగిన చర్యలు తీసుకోవాలని గవర్నర్ అభిప్రాయపడ్డారు.

ఎక్కువ స్థానాలుంటేనే గౌరవం

- ఇద్దరు ఎంపీలున్నా స్వేచ్ఛగా పార్టీ జెండా ఎగరేయలేకున్నాం
- డీపీఐ నేత తిరుమావళవన్

ధర్నాలో పాల్గొన్న తిరుమావళవన్



ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు పార్లమెంట్ సభ్యులున్నప్పటికీ స్వేచ్ఛగా పార్టీ జెండా కూడా ఎగురవేయలేకపోతున్నామని దళిత్ పాంథర్ ఆఫ్ ఇండియా (డీపీఐ) అధ్యక్షుడు తిరుమావళవన్ నిర్వేదం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఎండీఎంకే, డీపీఐ సహా పలు పార్టీలున్నాయి. ఇటీవల ఆ కూటమి నేతల మధ్య భిన్నాభిప్రాయాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే అదనంగా సీట్లు డిమాండ్ చేయాలని డీపీఐ నిర్వాహకులు పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ వద్ద తమ మనోగతాన్ని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎస్సీఎస్టీ సంక్షేమ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన మహానాడులో తిరుమావళవన్ పాల్గొని ప్రసంగించారు. రాజకీయాల్లో శాశ్వతంగా నిలదొక్కుకోవాలంటే ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య ఎక్కువగా వుండాలని, అలాంటి పార్టీకే తగిన గుర్తింపుంటుందన్నారు. రాజకీయ పరంగా ఎస్సీఎస్టీలు బలంగా ఎదిగితేనే అధికార వర్గాలను ప్రశ్నించగలమన్నారు. డీపీఐలో ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలున్నప్పటికీ స్వేచ్ఛగా జెండా ఎగురవేయలేని పరిస్థితి వుందని ఆయన వాపోయారు. అంబేడ్కర్ తీసుకొచ్చిన రాజ్యాంగం ఇంకా పూర్తిగా అమలు జరగలేదని, ఆయిన దీనిపై ఏ రాజకీయ పార్టీ కూడా మాట్లాడటం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయముందని, అందువల్లే పొత్తుల గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తిరుమావళవన్ తెలిపారు.

సమాచార దర్శిని

ఆవడి, గుమ్మిడిపూండి మార్గంలో కొత్త రైలు

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై-ఆవడి, గుమ్మిడిపూండి మార్గాల్లో సోమవారం నుంచి కొత్త సబర్బన్ రైలు సేవలు ప్రారంభించనున్నట్లు చెన్నై రైల్వే ప్రాంతీయ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకారం, చెన్నై సెంట్రల్-ఆవడికి ఉదయం 11.15 గంటలు, ఆవడి-సెంట్రల్‌కు తెల్లవారుజామున 5.25 గంటలకు, సెంట్రల్-గుమ్మిడిపూండికి రాత్రి 10.35 గంటలు, గుమ్మిడిపూండి-సెంట్రల్‌కు ఉదయం 9.10 గంటలకు కొత్త సబర్బన్ రైళ్లు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, అంబత్తూర్, తండయార్‌పేట, కేకే నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. మైలాపూర్ పరిధిలో కోడంబాక్కం హై రోడ్డు వళ్లువర్‌కోట్టం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్, అంబత్తూర్ పరిధిలో అంబత్తూర్ సిప్కాట్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో గ్రీవెన్స్ జరుగనుంది. అలాగే, తండయార్‌పేట పరిధిలో తండయార్‌పేట టవర్ క్లాక్ ఎదురుగా ఉన్న నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, కేకే నగర్ ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలోని కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు తెలియజేసింది.

భవన నిర్మాణ కార్మికులకు రూ.1,402 కోట్ల సాయం

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో గడిచిన నాలుగేళ్లలో కార్మికులకు రూ.1,402 కోట్ల ఆర్థిక సాయం అందజేసినట్లు బోర్డు ఛైర్మెన్ పొన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమార్థం 1994 నవంబరు 30వ తేది బోర్డు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో సభ్యులుగా చేరిన కార్మికులకు ఇప్పటివరకు రూ.2,266.22 కోట్ల మేర సహాయాలు అందజేశామన్నారు. డీఎంకే అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 17,76,380 మంది లబ్ధిదారులకు రూ.1,402 కోట్ల సహాయం అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల టీచర్ల విద్యార్హత వివరాలు

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల విద్యార్హత వివరాలు సమర్పించాలని ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రాథమిక విద్యా డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో.. ప్రాథమిక విద్య డైరెక్టరేట్ పరిధిలో పనిచేస్తున్న పాఠశాలల్లో సెకండరీ, ప్రైమరీ, గ్రాడ్యుయేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తప్పనిసరి అని మద్రాసు హైకోర్టు తీర్పుపై దాఖలైన అప్పీలు పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణకు విద్యా సంస్థ, విద్యా సంస్థ తదితర వివరాలు దాఖలు చేయాలని ఆదేశించిందన్నారు. అందువలన సెకండరీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయుల విద్యార్హత వివరాలు వేర్వేరుగా పూర్తిచేసి డైరెక్టరేట్ ఈ-మెయిల్‌కు పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో తమిళ ఉపాధ్యాయులు

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన తమిళ ఉపాధ్యాయులను నియమించనున్నారు. రాష్ట్రంలో త్రిభాషా విధానం అవసరం లేదని, నిర్బంధ హిందీకి వ్యతిరేకంగా డీఎంకే, కూటమి పార్టీలు ఆందోళనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న 34 కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో ఒక్క తమిళ ఉపాధ్యాయుడు కూడా లేడని డీఎంకే ఎమ్మెల్యే ఎళిలన్ ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అందిన ఈ సమాచారంతో, తమిళ విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో తమిళ మాతృభాష చదువుకొనేందుకు కేంద్రీయ విద్యాలయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేరని, సంస్కృతం నేర్పేందుకు 15 మంది, హిందీ బోధనకు 52 మంది ఉపాధ్యాయులున్నట్లు తెలిసింది. ఈ చర్యలు హిందీ నిర్బంధానికి సంకేతాలని డీఎంకే ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం తిరువారూరులోని కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో తమిళ ఉపాధ్యాయులు సహా పలు పోస్టులు భర్తీ చేశారు. అలాగే తాజాగా శివగంగ జిల్లా కారైక్కుడి కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో కూడా తమిళ ఉపాధ్యాయుడు నియామకానికి నోటిఫికేషన్ విడుదలైంది.

1300 యోగా శిక్షకుల నియామకం

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో 1300 యోగా శిక్షకులను నియమించాలని భారతీయ వైద్య, హోమియోపతి విభాగం డైరెక్టర్ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. 1300 ప్రభుత్వాసుపత్రులు, ఆయుష్ జాతీయ వైద్య కేంద్రాల్లో పురుషులు, మహిళలకు తలా 650 మంది యోగా శిక్షకులను నియమించాలని భారత వైద్య, హోమియోపతి శాఖ డైరెక్టర్ విజయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేశారు. శిక్షకులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన గంటకు రూ.250 చొప్పున నెలకు 30 తరగతులకు రూ.8,000 చెల్లించనున్నారు. వాటిలో 20 తరగతులు ఆస్పత్రులు, 12 తరగతులు పాఠశాలలు, శిబిరాల్లో నిర్వహించాలి. ఆసుపత్రుల్లో మాత్రమే తరగతులు నిర్వహించే వారికి నెలకు రూ.5,000 ఇవ్వాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

కిలాంబాక్కం వరకే దక్షిణ జిల్లాల బస్సులు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ జిల్లాల నుండి దిండివనం, చెంగల్పట్టు మీదుగా తాంబరం వరకు నడుపుతున్న బస్సులను ఇకపై కిలాంబాక్కం వరకు మాత్రమే నడపనున్నట్లు చెన్నై మెట్రో పాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) ప్రకటించింది. ఆ సంస్థ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా వున్నాయి. నగర శివారు ప్రాంతమైన తాంబరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించే దిశగా తాంబరం నగర ట్రాఫిక్ పోలీసుల ప్రతిపాదన మేరకు, దక్షిణ జిల్లాల నుండి తాంబరం వరకు ప్రస్తుతం నడుపుతున్న బస్సులను ఈ నెల 4వ తేదీ మంగళవారం నుంచి కిలాంబాక్కం కొత్త బస్ టెర్మినల్ వరకు నడుపనున్నట్లు ప్రకటన విడుదలైంది.

కరయన్‌చావడి - ముల్లైతోట్టం మెట్రో పూర్తి



గ్రేడ్ సపరేటర్ పనులు చేస్తున్న సిబ్బందితో అధికారులు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రెండోదశ మెట్రోరైలు పథకంలో మైలాపూర్‌లోని లైట్‌హౌస్ - పూందమల్లి వరకు నిర్మిస్తున్న నాలుగో మార్గంలోని కరయాన్ చావడి - ముల్లైతోట్టం స్టేషన్ల మధ్య ఫ్లైఓవర్ పనులు పూర్తిచేసినట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) ఓ ప్రకటనలో పేర్కొంది. రాజధాని నగరంలో రెండో దశ మెట్రోరైలు పథకం 16.1కిలోమీటర్ల దూరంలో మూడు మార్గాల్లో నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందులో లైట్‌హౌస్ నుంచి పూందమల్లి బైపాస్ వరకు ఉన్న నాలుగో మార్గం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ మార్గంలో లైట్‌హౌస్ నుంచి కొడంబాక్కం ఫ్లై ఓవర్ వరకు సొరంగ మార్గంగా, కొడంబాక్కం పవర్ హౌస్ నుండి పూందమల్లి బైపాస్ వరకు మొత్తం 424 స్తంభాలతో కూడిన ఫ్లైఓవర్ మార్గాలు ఏర్పాటవుతున్నాయి. 9 సొరంగ మెట్రో రైల్వేస్టేషన్లు, 18 ఫ్లైఓవర్ల రైల్వేస్టేషన్లు ఏర్పాటవుతున్నాయి. కరయాన్‌చావడి నుండి ముల్లైతోట్టం వరకు స్టేషన్ల మధ్య గ్రేడింగ్ పనులు శనివారం పూర్తికావడంతో సీఎంఆర్‌ఎల్ డైరెక్టర్ అర్జునన్, సీజీఎం ఎస్‌ఆర్ అశోక్‌కుమార్‌లతో కూడిన అధికారుల బృందం పూర్తయిన పనులను పరిశీలించారు.

సామూహిక అత్యాచారం కేసులో నలుగురి అరెస్ట్

వేళచ్చేరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తేనిలో యువతిని బెదిరించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తేని సమీపం పళనిచెట్టిపట్టి పోలీస్‌స్టేషన్‌కు శనివారం వచ్చిన 22 ఏళ్ల యువతి, తనపై నలుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేసింది. ఈ విషయమై తేని మహిళా సీఐ మంగయార్ తిలగం, తేని సీఐ రామలక్ష్మి ఆ యువతిని విచారించారు. శుక్రవారం సాయంత్రం తాను బస్సు కోసం వేచి ఉండగా, పరిచయమైన ఆటో డ్రైవర్, మరో స్నేహితుడితో మోటారు సైకిల్‌పై వచ్చారని, తనను ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి తనను బైక్ ఎక్కించుకొని, బెదిరించి అల్లినగరం ప్రాంతంలోని ఓ ఇంటికి తీసుకెళ్లారని, అప్పటికే అక్కడ మరో ఇద్దరు యువకులు కలిసి తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, మరో ప్రాంతంలో దింపి వెళ్లారని బాధిత యువతి తెలిపింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆటో డ్రైవర్ సహా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి పంపించామని, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

క్వారీకి వ్యతిరేకంగా రాస్తారోకో

సినీ దర్శకుడి సహా 44 మందిపై కేసు



రాస్తారోకోలో పాల్గొన్న కరడిపుత్తూరు గ్రామస్తులు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మడిపూండి సమీపంలో నిర్వహిస్తున్న రాళ్ళ క్వారీకి వ్యతిరేకంగా ఆదివారం రాస్తారోకోలో పాల్గొన్న సినీ దర్శకుడు గోపీ నైనార్ సహా 44మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గుమ్మడిపూండి సమీపంలోని కరడిపుత్తూరు గ్రామంలో ప్రభుత్వానికి చెందిన 5ఎకరాల బీడు భూములున్నాయి. ఆ స్థలంలో చెన్నై సహా రోడ్డు పనులకు అవసరమైన కంకర రాళ్ళ తయారీకి సంబంధించిన క్వారీకి ఇటీవల రాష్ట్రప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ క్వారీ నుండి లారీల్లో తరలించే కంకర వల్ల పర్యావరణం దెబ్బతింటోందని, లోడు వాహనాల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న స్థానికులు గత నెల 24వ తేదీ ఆ క్వారీని ముట్టడించారు. దీంతో ఫిబ్రవరి 28వ తేదీ ఆ క్వారీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ గ్రామస్తులు వీఏవో కార్యాలయానికి వెళ్ళి తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డులను తిరిగిచ్చేశారు. ఈ నేపథ్యంలో సినీ దర్శకుడు గోపీ నైనార్ కరడిపుత్తూరు గ్రామానికి ఆదివారం వెళ్ళి వారి తరుపున క్వారీకి వ్యతిరేకంగా వీఏవో కార్యాలయం ముందు బైటాయించి రాస్తారోకోలో పాల్గొన్నారు. అనుమతిలేకుండా ఆందోళనలో పాల్గొన్న 44మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జీసీసీ కాంగ్రెస్ కౌన్సిల్ ఛైర్మన్‌ను మార్చాలి

● పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్న కార్పొరేటర్లు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కాంగ్రెస్ కౌన్సిల్ ఛైర్మన్ ఎం.ఎస్ ద్రవ్యంను ఆ పదవి నుండి తొలగించాలంటూ అతడిని వ్యతిరేకిస్తున్న కార్పొరేటర్లు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. జీసీసీ ఎన్నికల్లో డీఎంకే కూటమి మద్దతుతో పోటీచేసిన కాంగ్రెస్ 13వార్డుల్లో గెలుపొందింది. ఇందులో 165వ వార్డు కార్పొరేటర్ నాంజిల్ ఈశ్వర ప్రసాద్ అనారోగ్యం కారణంగా మరణించారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా 2022వ సంవత్సరం వ్యవహరించిన కేఎస్ అళగిరి జీసీసీ కాంగ్రెస్ కౌన్సిల్ ఛైర్మెన్‌గా ఉత్తర చెన్నై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ఎస్ ద్రవ్యంను నియమించారు. ఈ నేపథ్యంలో 2024 ఫిబ్రవరిలో టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సెల్వ పెరుందగైను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, పదిమందికి పైగా పార్టీ జిల్లా అధ్యక్షులతో ఇటీవల ఢిల్లీకి వెళ్ళిన ద్రవ్యం పార్టీ పెద్దలను కలిసి వినతి పత్రం సమర్పించారు. కాగా 8 మంది జీసీసీ కాంగ్రెస్ కార్పొరేటర్లు జీసీసీ కౌన్సిల్ ఛైర్మెన్ పదవి నుంచి ఎం.ఎస్ ద్రవ్యంను మార్చాలంటూ సెల్వ పెరుందగైకు వినతిపత్రం అందించారు. అదే విధంగా ఢిల్లీలోని పార్టీ అధిష్టానం దృష్టికి కూడా వారు ఈ సమస్య తీసుకెళ్ళారు. కాగా, టీఎన్‌సీసీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌ఛార్జీగా నియమితులైన గ్రిస్ సోలంకర్ మొట్టమొదటిసారిగా ఆదివారం నగరానికి వచ్చారు. జీసీసీ కాంగ్రెస్ కౌన్సిల్ ఛైర్మెన్‌కు వ్యతిరేకంగా గ్రిస్ సోలంకర్‌కు కూడా ఫిర్యాదుచేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

పాఠశాలకు బెంచ్‌లు, డెస్కుల వితరణ



దాతలను అభినందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

తిరుత్తణి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు డెస్కులు, బెంచీలు వితరణ ఇచ్చిన దంపతులను పాఠశాల నిర్వాహకులు సత్కరించారు. తిరువళ్లూర్ జిల్లా నెడియం ప్రభుత్వ తెలుగు పాఠశాలలో 145 మంది విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చునేందుకు సరిపడా బెంచీలు, డెస్కులు లేవనే విషయం తెలుసుకున్న నెడియం గ్రామానికి చెందిన చెంగయ్య-వరలక్ష్మి దంపతులు, వారి పూర్వీకులు నరసింహులు శెట్టి-నరసమ్మ స్మారకార్థం రూ.5 లక్షల విలువైన బెంచీలు, డెస్కులు పాఠశాలకు అందజేశారు. దాతలను పాఠశాల నిర్వాహకులు పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు అదే గ్రామానికి చెందిన మోహన్‌బాబు కుమార్తెలు నిషిత, మానస బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తిరుత్తణి పీకాక్ హాస్పిటల్ అధినేత డా.కిరణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశ్వినకుమార్, ఆడిటర్ గంగిరెడ్డి, పారిశ్రామికవేత్తలు చంద్రశేఖర్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక 'నకిలీ పోలీస్' అన్నామలై

● మంత్రి పీకే శేఖర్‌బాబు విమర్శ



అన్నదానం చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కర్ణాటక నకిలీ పోలీస్ అని హిందూ దేవాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు ఘాటుగా విమర్శించారు. ఎగ్మోర్ నియోజకవర్గం తిరువెంగడం వీధిలో ఆదివారం డీఎంకే ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ 72వ జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర పోలీసు శాఖ పనితీరుపై పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి విమర్శలు గుప్పించడం సరికాదన్నారు. ఆయన తన పార్టీనే కంట్రోల్‌లో వుంచుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. పీఎంకే ఆధిపత్య వ్యవహారంలో తండ్రి, కొడుకుల మధ్య తలెత్తిన విభేదాలను పరిష్కరించుకోవడంపై వారు దృష్టిసారించాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మరో ఎనిమిది నెలల్లో డీఎంకే కూటమిలో చీలికలు ఏర్పడతాయని విమర్శించారని, ఆయన కల ఎప్పటికీ నెరవేరబోదన్నారు. సంఘ విద్రోహులకు మద్దతు తెలుపుతున్న అన్నామలై కర్ణాటక నకిలీ పోలీస్ అని మంత్రి శేఖర్‌బాబు విమర్శించారు.

లంచం ఆశించిన బిల్ కలెక్టర్, బ్రోకర్ అరెస్ట్

వేళచ్చేరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుకు రసీదు ఇచ్చే వ్యవహారంలో లంచం ఆశించిన బిల్ కలెక్టర్, బ్రోకర్ కటకటాలపాలయ్యారు. పెరంబలూరు ఆలంబాడికి చెందిన వేల్‌మురుగన్ కొంత ఇల్లు నిర్మించుకున్నారు. కొత్త ఇంటికి వేసే పన్ను వివరాల కోసం స్నేహితుడు సుభాష్ చంద్రబోస్ ద్వారా మున్సిపల్ కార్యాలయంలో వేల్‌మురుగన్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ శివకుమార్‌ను చంద్రబోస్ కలవగా, బిల్లు వేసేందుకు రూ.25 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని చంద్రబోస్, జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. వారి సూచనలతో రసాయనాలు పూసిన కరెన్సీని శనివారం బిల్ కలెక్టర్‌కు అందజేసేందుకు యత్నించగా, పక్కనే ఉన్న బ్రోకర్ రాముకు ఇవ్వాలని తెలిపాడు. రాము చేతికి చంద్రబోస్ నగదు అందిస్తుండగా అక్కడే మాటువేసిన విజిలెన్స్ పోలీసులు, పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో రాముతో పాటు బిల్ కలెక్టర్ శివకుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని విచారిస్తున్నారు.

చిట్టీల పేరుతో రూ.16 లక్షలు మోసం

● ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటు

వేళచ్చేరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సేలంలో చీటీలు నడిపి మహిళా ఎస్‌ఐ ని రూ.16 లక్షల మేర మోసగించిన వ్యవహారంలో సాయుధదళం ఎస్‌ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటుపడింది. ఆయుధదళం ఎస్‌ఎస్‌ఐగా పనిచేస్తున్న భాస్కరన్ వేలం చీటీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అతని వద్ద పేలుడు పదార్థాల విభాగంలో పనిచేస్తున్న ఎస్‌ఎస్‌ఐ లోకాంబాళ్ రూ.16 లక్షలు చీటీలకు చెల్లించినట్లు తెలిసింది. గుడువు ముగిసినా నగదు ఇవ్వపోవడంతో లోకాంబాళ్ పోలీసు కమీషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అధికారులు, ప్రభుత్వ విధుల్లో ఉంటూ వేలం చీటీలు నిర్వహించిన ఎస్‌ఎస్‌ఐ భాస్కరన్‌ను సస్పెండ్ చేశారు.

సీమాన్ వ్యవహారం కంట్లో నలుసులాంటిది

● మంత్రి రఘుపతి

వేళచ్చేరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీమాన్ వ్యవహారం మాకు కంట్లో నలుసు లాంటిదని న్యాయశాఖ మంత్రి రఘుపతి వ్యాఖ్యానించారు. పుదుకోటలో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... సీమాన్‌పై కేసు పలు ఏళ్లుగా సాగుతోందని, ఆయనపై ఓ మహిళ ఆరోపణలు చేసిందని తెలిపారు. ఈ వ్యవహారంలో డీఎంకేకు ఎలాంటి సంబంధాలు లేవని, న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు కేసు విచారణ జరుగుతోందన్నారు. ఈ కేసు రద్దు చేయాలని సీమాన్ వేసిన పిటిషన్ రద్దు చేసిన హైకోర్టు, కేసు విచారణ చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేసిందని మంత్రి పేర్కొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జనార్దన్

వేలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం కేఎంజీ సైన్స్ఆర్ట్స్ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ సంఘం ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ దండపాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని కళాశాల అధ్యక్షుడు రాజేంద్రన్ ప్రారంభించారు. రెడ్ క్రాస్ సంఘ అధ్యక్షుడు జనార్ధనన్ ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తమిళనాడు సైన్స్ ఇయక్కం జిల్లా కోశాధికారి కుమరన్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మణికంఠన్, కళాశాల ఆర్గనైజర్ జయకుమార్, యూత్ రెడ్‌క్రాస్ ఆర్గనైజర్ రఘువర్మన్ పాల్గొన్నారు.

ఎంకే త్యాగరాజ భాగవతార్ 115వ జయంతి వేడుకలు



వేలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నటుడు ఎంకే త్యాగరాజ భాగవతార్ 115వ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు విశ్వకర్మ స్నేహితుల సంఘం అధ్యక్షుడు తేజోమూర్తి, నిర్వాహకులు పాల్గొని, భాగవతార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ఆర్గనైజర్ నటరాజన్, ఉపాధ్యక్షుడు పన్నీర్‌సెల్వం, సభ్యులు జగదీశన్, శక్తీశ్వరన్, శరవణన్, కరుణాకరన్ పాల్గొన్నారు.

పాఠశాలకు సోలార్ ప్యానెళ్ల అందజేత

తిరుత్తణి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పల్లిపట్టు ఖాదర్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) ద్వారా ఉచిత ప్యానెళ్లు అందజేశారు. సాయి మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలులో జరిగిన కార్యక్రమానికి స్కూలు ప్రిన్సిపాల్ ఎం.గురుమూర్తి అధ్యక్షత వహించారు. కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్-2 సయ్యద్ కరీముల్లా ప్యానళ్ల ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘ సభ్యులు కేశవన్, కందన్, జగదీష్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.



మాజీ అధికారుల సంఘం ప్రారంభం



జెండా ఎగురవేస్తున్న నిర్వాహకులు

వేలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మాజీ అధికారుల సంఘం వేలూరు శాఖ ఆదివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి సంఘ జిల్లా అధ్యక్షుడు మురుగన్ అధ్యక్షత వహించారు. జిల్లా జాయింట్ సెక్రటరీ నందకుమార్, సెక్రటరీ మనోహరన్, నిర్వాహకులు నటరాజన్, పురుషోత్తమన్, వెట్రివేలన్, నారాయణరావు, మాసిలామణి, మురుగన్, మణి సహా పలువురు పాల్గొన్నారు. సంఘ పీఆర్వో రాజ కృతజ్ఞతలతో సమావేశం ముగిసింది.

ఆగని వీధి కుక్కల దాడి

● వీఏఓ కార్యాలయానికి గొర్రెలు తరలించిన రైతు



వీఏఓ కార్యాలయ ప్రాంగణంలో ఉంచిన గొర్రెలు

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తన గొర్రెలకు భద్రత కల్పించాలంటూ ఓ రైతు వీఏఓ కార్యాలయానికి వాటిని తరలించడం కలకలం రేపింది. తిరుప్పూర్ జిల్లా వెల్లకోయిల్, కాంగేయం, తారాపురం, చుట్టుపక్కల గ్రామాల్లో వీధికుక్కల దాడిలో మేకలు, గొర్రెలు, పశువులు మృత్యువాతపడుతున్నాయి. మృతిచెందిన జీవాలకు పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో పాటు ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, ఈరోడ్ జిల్లా సెన్నిమలై యూనియన్ సిరుకలంజి గ్రామంలోని ఒక వ్యవసాయ తోటలో ఉంచిన 12 మేకలపై వీధికుక్కలు దాడిచేయడంతో వాటిలో రెండు మృతిచెందాయి. గాయపడిన వాటిని, రైతు ఆ ప్రాంతంలోని గ్రామ నిర్వహణ కార్యాలయ ప్రాంగణంలోకి తరలించి, భద్రత కల్పించాలని కోరుతూ అక్కడే వదిలి వెళ్లడం కలకలం రేపింది.

నేలబొగ్గు తరలించేందుకు 21 గూడ్సు రైళ్లు

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఒడిశా గనుల నుంచి రాష్ట్రానికి నేలబొగ్గు తరలించేందుకు 21 గూడ్సు రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర విద్యుత్ బోర్డు ఆధ్వర్యంలో 4,320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు థర్మల్ విద్యుత్ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ప్రతిరోజు విద్యుదుత్పత్తికి 72,000 టన్నుల నేలబొగ్గు అవసరమవుతోంది. ఈ బొగ్గును ఒడిశా గనుల నుంచి గూడ్సు రైళ్ల ద్వారా ఆ రాష్ట్రంలోని పారాదీప్ పోర్టుకు తరలిస్తుంటారు. అక్కడ నుంచి నౌకలో రాష్ట్రానికి తరలిస్తుంటారు. కాగా, గనుల నుంచి పారాదీప్ పోర్టుకు తరలించేందుకు తగినన్ని గూడ్సు రైళ్లు లేవని, వచ్చే వేసవిలో విద్యుత్ అవసరాలకు పూర్తిచేసేలా నేలబొగ్గు అవసరం అధికమవుతోందని, అందువల్ల గనుల నుంచి పోర్టుకు రవాణా చేసేందుకు అదనపు రైళ్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తి పరిశీలించి కేంద్రం, 21 గూడ్సు రైళ్లు కేటాయించింది.

గూండా చట్టం కింద అరెస్ట్

వేలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి గర్భిణిని తోసివేసిన ఘటనపై అరెస్టయిన హేమరాజును గూండా చట్టం కిం అరెస్ట్ చేశారు. ఎస్పీ సిఫారసుతో కలెక్టర్ సుబ్బులక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు.

నిబంధనలు అతిక్రమించి గర్భస్రావం

మూడు ఆస్పత్రులు మూసివేత

వేళచ్చేరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సేలంలో నిబంధనలకు వ్యతిరేకంగా గర్భస్రావం చేస్తున్న వ్యవహారంలో మూడు ప్రైవేటు ఆస్పత్రులు మూతపడ్డాయి. సేలం సమీపం వీరాణం సిప్కాట్ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న పసుపతి స్కాన్ సెంటర్‌లో గర్భస్థ శిశువు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. ఆ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన అధికారులు, ఆరోపణలు నిజమని తేలడంతో ఆ సెంటర్‌కు సీలు వేశారు. ఈ సెంటర్ నడుపుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి ముత్తమిళ్, నర్సు కలైవాణిలను సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంపై వీరాణం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో తెలిసిన వివరాల మేరకు గ్రామ ఆరోగ్య కేంద్రాల నర్సులు అంబిక, వనిత, వసంతి, మంగై, రాణి, కలైసెల్వి, మహేశ్వరి తదితరులపై కూడా సస్పెన్షన్ వేటుపడింది. అలాగే, సేలం టౌన్ మేట్టు వీధి, పొన్నమ్మపేట, పెరియపుదూర్ ప్రాంతాల్లో ఉన్న మూడు ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు అతిక్రమించి సుమారు 50కి పైగా మహిళలకు గర్భస్రావం చేసినట్లు తెలియడంతో, మూడు ఆసుపత్రులను అధికారులు సీలు వేసి, విచారణ చేపట్టారు.

జైలులో మొక్కలు నాటిన సమాజ సేవకుడు



మొక్కలు నాటుతున్న జైళ్ల శాఖ డీజీపీ అమరేష్ పూజారి

వేలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక తొరపాడి సెంట్రల్ జైలులో సమాజ సేవకుడు దినేష్ శరవణన్ గతంలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. జైలు ప్రాంగణంలో ఆదివారం మరో 500 మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జైళ్ల శాఖ డీజీపీ అమరేష్ పూజారి మొక్క నాటి లాంఛనంగా ప్రారంభించారు. వేలూరు జైళ్ల శాఖ డీఐజీ సెందామరై కన్నన్, జైళ్ల శాఖ జిల్లా ఎస్పీ అబ్దుల్ రెహ్మాన్, సమాజసేవకుడు దినేష్ శరవణన్, అధికారులు పాల్గొన్నారు.

'సెట్' నిర్వహణపై సమావేశం

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) నిబంధన మేరకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించనున్న స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ (సెట్)కు సంబంధించి సచివాలయంలో ఉన్నతాధికారుల సమావేశం ఆదివారం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమై వారికి కీలక సూచనలు చేశారు. ఈ నెల 6,7,8,9 తేదీల్లో అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసిన 133 పరీక్షా కేంద్రాల్లో 99.178 మంది అభ్యర్థులు సెట్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్‌ను www.trb.in.govt.in అనే వెబ్‌సైట్ నుంచి 97,865 మంది అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. పరీక్షలకు సంబంధించిన సందేహాల గురించి అభ్యర్థులకు వివరించేందుకు ఎడుగురు అధికారులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది. అంతేకాకుండా అభ్యర్థుల కోసం 18004256753 అనే టోల్‌ఫ్రీ నెంబర్ కూడా కల్పించింది. ఈ నేపథ్యంలో సెట్ పరీక్షలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా జరిగేందుకు చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలిచ్చారు. సచివాలయం ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి మూర్తి, టెట్ ఛైర్మెన్ జయంతి, కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ సుందరవల్లి, టెక్నికల్ ఎడ్యుకేషనల్ కమిషనర్ ఇన్నోసెంట్ దివ్య సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్‌కు పలు ప్రాంతాల నుంచి అధికస్థాయిలో కూరగాయలు దిగుమతవుతున్న నేపథ్యంలో టమోట, ఉల్లి, వెల్లుల్లి ధరలు తగ్గించడంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో గత కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా కూరగాయల ఉత్పత్తి బాగా పడిపోయింది. రెండు నెలల వరకు టమోట, ఉల్లి, దిగుమతి తగ్గిపోవడంతో వాటి ధరలు కూడా పెరిగాయి. కిలో టమోట ధర రూ.100, ఉల్లి ధర రూ.120, వెల్లుల్లి కిలో రూ.500 వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌కు శనివారం నుంచి అధికస్థాయిలో కూరగాయలు దిగుమతవడంతో కిలో ఉల్లి రూ.20 నుండి రూ.30, చిన్న ఉల్లి కిలో రూ.50, టమోట కిలో రూ.15 నుండి రూ.20కు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. కూరగాయల అమ్మకాలు తగ్గడంతో చిరువ్యాపారులు వాహనాలతో వీధుల్లో తిరుగుతూ కూరగాయలు విక్రయిస్తున్నారు.


భాగ్యశ్రీకి కోలీవుడ్ ఛాన్స్


భాగ్యశ్రీ బోర్సే

టాలీవుడ్ హీరో రవితేజ హీరోగా వచ్చిన 'మిస్టర్ బచ్చన్' చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన యువ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు కోలీవుడ్ ఛాన్స్ వరించింది. అగ్రనటుడు సూర్య హీరోగా తెరకెక్కే '760 సీసీ' అనే మూవీలో ఆమెను కథానాయికగా ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. తమిళ, తెలుగు భాషల్లో రూపొందే మూవీకి టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్మెంట్ నిర్మించే ఈ సినిమా హీరో సూర్యకు 46వ చిత్రం. దేశంలో తొలిసారి ఇంజిన్ ఎలా తయారు చేశారన్న నేపథ్యంలో రూపొందనుంది. అందుకే ఈ మూవీకి '760 సీసీ' అనే టైటిల్ ఖరారు చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. హీరోయిన్ భాగ్యశ్రీ ప్రస్తుతం రామ్ పొత్తినేని, దుల్కర్ సల్మాన్ చిత్రాల్లో నటిస్తున్నారు. త్వరలోనే తన తమిళ కొత్త చిత్రం అప్‌డేట్ వివరాలు వెల్లడిస్తారంటూ ఆమె పేర్కొన్నారు. పైగా, తొలిసారి తమిళ సినిమాలో నటించే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

అశోక్, కీర్తి జంటగా కొత్త చిత్రం

తమిళ చిత్రజ్యోతి




అశోక్ సెల్వన్ - కీర్తి సురేష్

అశోక్ సెల్వన్, కీర్తి సురేష్ జంటగా ఓ చిత్రంలో నటించనున్నారు. 'వన్స్‌మోర్', 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి చిత్రాల నిర్మాణాన్ని మిలియన్ డాలర్ సంస్థ పూర్తి చేసింది. ఈ చిత్రాల విడుదల తేదీ ఇంకా ఖరారు చేయలేదు. అయినప్పటికీ మరో కొత్త చిత్రానికి ఈ సంస్థ ప్లాన్ చేసింది. కొత్త దర్శకుడు డైరెక్షన్ చేసే ఈ చిత్రంలో హీరోహీరోయిన్లుగా అశోక్ సెల్వన్, కీర్తి సురేష్ నటించనుండగా ఏప్రిల్‌లో సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సింగిల్ షెడ్యూల్‌లోనే చిత్రీకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ తరువాత నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసి ఈ యేడాది చివరలో విడుదల చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. డైరెక్టర్ పేరుతో పాటు అందులో నటించే నటీనటుల పేర్లు, పనిచేసే టెక్నీషియన్ల పేర్లను ప్రకటించనున్నారు.

15 నుంచి 'మూక్కుత్తి అమ్మన్' షూటింగ్


'మూక్కుత్తి అమ్మన్'లో నయనతార

అగ్రహీరోయిన్ నయనతార ప్రధాన పాత్రలో కొవిడ్ సమయంలో విడుదలై ఘన విజయం సాధించిన చిత్రం 'మూక్కుత్తి అమ్మన్' ఎన్‌జే శరవణన్‌తో కలిసి నటుడు ఆర్‌జే బాలాజీ దర్శకత్వం వహించారు. 2020లో ఓటీటీలో విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇపుడు రెండో భాగాన్ని తెరకెక్కించనున్నారు. అయితే, రెండో భాగానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తుండటం గమనార్హం. వేల్స్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ సంస్థ, రౌడీ పిక్చర్స్, అన్ని సినిమాక్స్, ఐవీవై ఎంటర్‌టైన్మెంట్, బిఫోర్ యూ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా షూటింగ్ ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్టు దర్శకుడు సుందర్ ప్రకటించారు. ఇందుకోసం ప్రసాద్ ల్యాబ్‌లో భారీ సెట్ నిర్మించారు. ఇక్కడే షూటింగ్ చేపట్టనున్నారు. మరోవైపు, ఇందులో నటించే నటీనటుల ఎంపిక కూడా పూర్తిచేశారు.


పళసిరాజా సైనికులతో తలదాచుకున్న గుహ


గుహలో దీపాలు వెలిగిస్తున్న పళసి రాజా వారసులు


గుహ వద్ద పళసిరాజా ఆరో తరం వారసులు


గుహ లోపలి భాగం

17వ శతాబ్దం నాటి బిలం

పోరాట యోధుల స్థావరం

- నీలగిరిలో బయల్పడిన పళసి రాజా గుహ
- పర్యాటకుల సందర్శనకు అనుమతి

కేరళ రాష్ట్రంలో పలు ప్రాంతాలను పాలించిన పళసి రాజా, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన సమయంలో తలదాచుకున్న గుహ ఒకటి నీలగిరిలో తాజాగా బయల్పడింది. ఈ గుహను చూసేందుకు పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఇంతకీ ఆ రాజా ఎవరు? ఈ గుహ కథా కమామిషు ఏంటో తెలుసుకుందాం రండి!
- పెరంబూర్

కేరళ కొట్టాయం, మలబార్ ప్రాంతాలను పళసిరాజా 1753 నుంచి పాలించారు. నీలగిరి జిల్లా ముదుమలై, నొలాకోట, శ్రీ మదురై, సేరంబాడి, మసినకుడితో పాటు కన్నూర్, వయనాడు జిల్లాలోని తలైచేరి తదితర ప్రాంతాలు కలిపి కొట్టాయం మండలంగా ఉండేవి. ఆంగ్లేయుల పాలనలో పన్ను వసూళ్లకు వ్యతిరేకంగా గళం విప్పడంతో పాటు, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడంతో, ఆయనకు ప్రజల నుంచి మద్దతు లభించింది. ఆంగ్లేయుల బలగాలు కొట్టాయం పళసిరాజా రాజభవనాన్ని చుట్టుముట్టిన సమయంలో ఆయన అక్కడి నుంచి వయనాడు కొండ ప్రాంతానికి చేరుకున్నారు. 1799లో వయనాడు ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. అనంతరం పళసి రాజా తన సైనిక బలగాలతో అడవుల్లో ఉంటూ ఆంగ్లేయులతో పోరాడారు. అలాగే, ఆ ప్రాంతాల్లోని 'కురిసియా' ఆదివాసీయులను ఏకం చేసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా చేసే పోరాటంలో భాగస్వాములను చేశారు. ఆ సమయంలో, కురుంబ, పనియా ఆదివాసీ ప్రజల ఆదరణతో, సైనికులకు అవసరమైన ఆహారం, బస తదితరాల కోసం పలు ప్రాంతాలు ఏర్పాటు చేశారు. కురుంబ ఆదివాసీ ప్రజలు యుద్ధంలో విల్లంబులు ఉపయోగించారు. అలాగే వయనాడు, నీలగిరి కొండ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో తమకు అనుకూలమైన ప్రాంతాలు సిద్ధం చేసుకున్నారు.

గుహ నుండి గొరిల్లా పోరాటం...

పళసిరాజా పందలూరు సమీపంలోని కోట్టమలై, నొలంకోట ప్రాంతాల్లో గుహలు ఏర్పాటుచేసుకొని, అందులో తన బలగాలతో ఉంటూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా గొరిల్లా పోరాటం చేసినట్లు చరిత్ర చెబుతోంది. వాటిలో ఓ గుహ ప్రస్తుతం బయల్పడింది. పందలూరు సమీపంలోని సేరంబాడి ప్రాంతంలో ఉన్న 'వెంట్‌వర్త్ ఎస్టేట్ టీ ఫ్యాక్టరీ సమీపంలో చిన్న గొయ్యిలా దొరికిన ప్రాంతాన్ని మరమ్మతు చేసి చారిత్రాక రికార్డులు పరిశీలించగా... అది పళసి రాజా బసచేసిన గుహ అని నిర్ధారణ అయింది. ఈ గుహ సుమారు 300 మీటర్ల వరకు ఉంటూ చివరన రెండుగా విడిపోతుంది. ప్రస్తుతం గుహలో ఉన్న పొదలు తొలగించి సందర్శకుల కోసం పునరుద్ధరించారు.


పళసి రాజా వారసులను సత్కరిస్తున్న ఆదివాసీయులు

గుహ బయట భాగం →


ఈ విషయమై శుభ వర్మ మాట్లాడుతూ... తమ పూర్వీకులైన పళసి రాజా సుమారు 31 ఏళ్ల పాటు బ్రిటీష్ వారితో పోరాడారని, ఆయన సైనికులతో కలసి ఉన్న గుహను చూడడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇలాంటి చారిత్రాక ఆనవాళ్లను ప్రజలకు తెలియజేయాలని, యోధులైన మన పూర్వీకులకు, వారికి రక్షణ ఉన్న ఆదివాసీ ప్రజల సహకారం తదితరాలు భవిష్యత్ తరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శుభ వర్మ ఆకాంక్షించారు.

పళసి రాజా ఆరో తరం...

ఈ గుహను ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న పళసి రాజా ఆరోతరానికి చెందిన కొచ్చు తంబురాటి శుభ వర్మ, ఆమె భర్త డా.కిషోర్ ప్రారంభించారు. తొలుత పళసి రాజా చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్టేట్ నిర్వాహకుల తరఫున కార్మికులు పళసి రాజా వారసులకు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం వారు తమ పూర్వీకులను స్మరించుకుంటూ ఆ ప్రాంతాలు సందర్శించారు. ఈ గుహ 1791-1801 కాలంలో నిర్మించబడి, గొరిల్లా యుద్ధ స్థావరంగా పనిచేసుందని చారిత్రిక ఆధారాలు చెబుతున్నాయి. ఈ గుహను ఇక నుంచి పర్యాటకులు సందర్శించవచ్చని, సందర్శకుల కోసం అధికారికంగా గుహను తెరిచామని ఎస్టేట్ నిర్వాహకులు తెలిపారు. అలాగే, యుద్ధ సమయంలో కురుంబ వర్గానికి చెందిన గోవిందన్ ఆచారి, తన తాత ఉపయోగించిన విల్లంబులతో యుద్ధంలో పాల్గొన్నాడు. ఆయన కుటుంబానికి, పళసి రాజా చిత్రాన్ని రూపొందించిన శిల్పి బినుకు వారసులు జ్ఞాపిక అందజేశారు.

విల్లుపురంలో పుస్తక ప్రదర్శన ప్రారంభం


దివంగత సీపీఎం కార్యదర్శి సీతారాం ఏచూరి జీవిత విశేషాలతో కూడిన పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్ముడి

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విల్లుపరం కొత్త బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ మైదానంలో తృతీయ వార్షిక పుస్తక ప్రదర్శన ఆదివారం ప్రారంభమైంది. విల్లుపురం జిల్లా యంత్రాంగం, దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ప్రచురణకర్తలు (పపాసి) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను మంత్రి పొన్ముడి ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో సుమారు 50 సంస్థలు స్టాల్స్ ఏర్పాటుచేయగా, 12వ తేది వరకు ప్రదర్శన జరుగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అబ్దుల్ రెహ్మాన్, ఎంపీలు దురై, రవికుమార్, ఎమ్మెల్యేలు లక్ష్మణన్ (విల్లుపురం), అన్నియూర్ ఎ.శివ (విక్రవాండి), ఏజే మణికన్నన్ (ఉళందూర్‌పేట) తదితరులు పాల్గొన్నారు.

కుట్రాలంలో రెండో రోజూ స్నానాలకు నిషేధం


ప్రధాన జలపాతం వద్ద నీటి ప్రవాహం

పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతాల వద్ద ఆదివారం రెండో రోజు కూడా పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించారు. ఈ జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాల వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉంది. దీంతో, పర్యాటకుల భద్రత దృష్ట్యా ఐందు అరువి, ప్రధాన జలపాతం వద్ద శనివారం పర్యాటకులు స్నానాలు చేసేందుకు జిల్లా యంత్రాంగం నిషేధించింది. ఆదివారం కూడా జలపాతాల వద్ద నీటి ప్రవాహం ఉండడంతో పర్యాటకులను ఆ ప్రాంతాలకు వెళ్లనివ్వలేదు. కుట్రాలం చేరుకున్న పర్యాటకులు, జలపాతాల వద్దకు అనుమతి ఇవ్వకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

ఊటీ గార్డెన్‌లో విరబూసిన రోజాలు



ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ప్రసిద్ధ వేసవి విడిదికేంద్రమైన ఊటీ గులాబీ గార్డెన్‌లో విరబూసిన పూలను చూసి పర్యాటకులు ఆనందిస్తున్నారు. వేసవి సీజన్ ప్రారంభంకావడంతో జిల్లాలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలోని పార్కులను అభివృద్ధి చేసేందుకు అధికారులు పనులు వేగవంతం చేశారు. ఊటీలోని ప్రభుత్వ బొటానికల్ గార్డెన్, గులాబీ గార్డెన్లు వార్షిక పుష్పప్రదర్శన కోసం ముస్తాబవుతున్నాయి. మూడు నెలల క్రితం ఈ పార్కుల్లో నాటిన రకరకాల పూల మొక్కలు ప్రస్తుతం వికసించి సువాసనలు వెదజల్లుతున్నాయి. అందమైన, రంగురంగుల ఈ పూల నడుమ పర్యాటకులు తమ కుటుంబాలతో కలిసి సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ పూల అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులతో గులాబీ గార్డెన్ శనివారం కళకళలాడింది.

బ్రాహ్మణ స్వయంవరానికి విశేష స్పందన



ప్రారంభోత్సవంలో గోటేటి వెంకటేశ్వరరావు, కల్య రఘుకుమార్ తదితరులు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో గత నాలుగు దశాబ్దాలకు పైగా ఆధ్యాత్మిక, సామాజిక రంగాలకు విశిష్ట సేవలందిస్తున్న తెలుగు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నవీన స్వయంవరానికి విశేష స్పందన లభించింది. స్థానిక టి.నగర్ బజుల్లా రోడ్డులోని రామకృష్ణ మిషన్ మెట్రిక్యులేషన్ పాఠశాల ప్రాంగణంలోని శారదా భవన్ వేదికగా ప్రత్యేక పూజలతో ప్రారంభమైన బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికకు టీబీఎం అధ్యక్షులు గోటేటి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సాయంత్రం 4గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని తెలుగు బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన 116మంది యువకులు, 37మంది యువతులు తమ తల్లిదండ్రులతో పాటు హాజరయ్యారు. వీరిలో ఐదుగురి జాతకాలు కుదరడంతో వివాహం జరిపించేందుకు ఆ కుటుంబాల పెద్దలు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో గోటేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తెలుగు బ్రాహ్మణ కుటుంబాల్లో పెళ్ళీడుకు వచ్చిన యువతి, యువకులకు టీబీఎం తరుపున గత 30ఏళ్ళుగా నవీన స్వయంవరాన్ని విజయవతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం జరిగిన స్వయంవరంలో వివాహం చేసుకునేందుకు నిర్ణయం తీసుకున్న ఐదుగురికి ఈ నెల 30వ తేదీ విశ్వావసు నామ ఉగాది వేడుకల్లో బంగారు మంగళసూత్రం, పెళ్ళి వస్త్రాలను టీబీఎం తరుపున కానుకగా అందజేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం టీబీఎం మాజీ అధ్యక్షులు కల్య రఘుకుమార్ మాట్లాడుతూ జ్యోతిష్యంపై ఆధారపడకుండా దైవాశీస్సులతో వివాహం జరిగితే ఆ సంసారం జీవితాంతం సుఖవంతంగా వుంటుందన్నారు. బ్రాహ్మణులు ప్రతిరోజు మూడుపూట్ల సంధ్యావందనం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీఎం నిర్వాహకులు ఎస్.జయరామన్, ఎల్ సాయినాథ్, వీ.అయ్యప్పన్, ఎల్.బాలసుబ్రమణ్యం, యూ.భాస్కర్, వి.చంద్రు, జీకే గోపాల రత్నం, ఆర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించండి

- ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ గిరీష్ చోదంకర్


సమావేశానికి హాజరైన నేతలు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదుపై దృష్టిసారించాలని రాష్ట్ర నాయకులకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీష్ చోదంకర్ సూచించారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో గిరీష్ చోదంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి సూరజ్ హెగ్డేలను టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై సత్కరించారు. సమావేశంలో కేంద్ర మాజీమంత్రులు కేవీ తంగబాలు, ఎస్.తిరునావుక్కరసు, మాజీ ఎంపీలు ఎం.కృష్ణస్వామి, కేఎస్ అళగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గిరీష్ చోదంకర్ మాట్లాడుతూ, రాజకీయ పార్టీకి కార్యకర్తలు వెన్నెముక లాంటివారని, అందువల్ల రాష్ట్ర కాంగ్రెస్‌లో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించాలని హితవుపలికారు.

ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు

- మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

ప్యారీస్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 30రోజులు ఐదు పూటల నమాజ్ చేయడంతో పాటు, తరావీహ్ ప్రత్యేక ప్రార్థనలకు రాష్ట్రవ్యాప్తంగావున్న మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ మాసంలో ఉపవాసాల సందర్భంగా తెల్లవారుజామున సహరి ద్వారా భోజనం స్వీకరిస్తారు. పగలంతా ఎటువంటి ఆహారం, నీరు కూడా తీసుకోకుండా సాయంత్రం వరకు కఠిన ఉపవాస దీక్ష కొనసాగించి, ఇఫ్తార్ విందుతో ఆ రోజు దీక్ష విరమిస్తున్నారు. కాగా, ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు కులమతాలకతీతంగా ఇఫ్తార్ విందు ఇచ్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు, సేవా సంస్థలు సిద్ధమయ్యాయి. ఆదివారం రంజాన్ మాసం ప్రారంభం కావడంతో తెల్లవారుజాము నుండి సాయంత్రం వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనలకు వెళ్తున్న ఇస్లామీయులతో మసీదులు కిటకిటలాడుతున్నాయి. మసీదులు విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. నాగపట్నం జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నాగూర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలతో ముస్లింలు ఉపవాస దీక్ష ప్రారంభించారు. అలాగే మదురై, తిరుచ్చి, చెన్నై, కోవై సహా అన్ని జిల్లాలోని దర్గాలు, మసీదులు ప్రత్యేక ప్రార్థనలతో కళకళలాడుతున్నాయి. ఇదిలా వుండగా, రంజాన్ మాసం ప్రారంభంకావడంతో మటన్, చికెన్ షాపుల్లో రద్దీ పెరిగింది. హలీమ్ ధరలు గత ఏడాది కంటే ఈసారి స్వల్పంగా పెరిగాయి.

ఊపందుకున్న పుచ్చకాయల విక్రయాలు



పెరంబూర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పుచ్చకాయల విక్రయాలు ఊపందుకున్నాయి. రాష్ట్రంలో గత నెల రెండో వారం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. పగటిపూట ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేలా ప్రజలు శీతల పానీయాలు, జ్యూస్ తదితరాలు సేవిస్తున్నారు. అలాగే, పండ్లు కూడా అధికంగా తీసుకుంటున్నారు. ఈ క్రమంలో, ప్రస్తుతం పొలాల్లో కోత పూర్తయి మార్కెట్లకు భారీగా పుచ్చకాయలు దిగుమతవుతున్నాయి. అదే విధంగా రైతులు సొంతంగా ఎద్దుల బండ్లపై నగరానికి పుచ్చకాయలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. రాబోయే రెండు నెలల్లో పుచ్చకాయల విక్రయాలు పెరగడంతో పాటు వాటి ధరలు కూడా పెరిగే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.



చెన్నై వీఐటీ క్యాంపస్‌లో శనివారం జరిగిన 'ఇంటర్నేషనల్ మెగా కల్చరల్ ఫెస్ట్' విజేతలకు బహుమతులు అందజేస్తున్న టాలీవుడ్ నటుడు నాగచైతన్య. (చిత్రంలో) వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్, ఉపాధ్యక్షులు జీవీ సెల్వం తదితరులు